



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 96 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 16 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 96 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 16 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

- ఏఐలో భారత్ పూర్తిస్థాయి లీడర్‌గా ఎదుగుతుందన్న శామ్ ఆల్ట్‌మన్
- చాట్‌జీపీటీకి ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ భారత్
- భారత్‌లో వారానికి 10 కోట్ల యాక్టివ్ యూజర్లు ఉంటున్నారని వెల్లడి
- భారత్‌లో కార్యకలాపాలను మరింత విస్తరిస్తామని ప్రకటన
- ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే సూచనలు



మిగతా2లో

## బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

- 2024లో కూలిపోయిన 2024లో షేక్ హసీనా ప్రభుత్వం
- తాత్కాలిక పాలకుడిగా కొనసాగిన మహ్మద్ యూనస్
- బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కొత్త ప్రభుత్వ ఏర్పాటు.. ప్రధానిగా తారిక్ రహ్మాన్
- ముహమ్మద్ యూనస్‌కు రాష్ట్రపతి పదవి దక్కవచ్చంటూ ఊహాగానాలు
- రాజకీయ పదవులపై తనకు ఆసక్తి లేదని స్పష్టం చేసిన యూనస్



మిగతా2లో

## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి:

### ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

- ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు బహుమతులు ఇచ్చిన అభ్యర్థులు
- మూడుచింతలపల్లి, మంచిర్యాల, భువనగిరిలో బహుమతులు వెనక్కి అడుగుతున్న అభ్యర్థులు
- ఇంటింటికి తిరిగి వసూలు చేసే ప్రయత్నం



మిగతా2లో

## కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

### మంత్రి నారా లోకేశ్ భరోసా

- మేడారం జాతరలో కర్నూలు చిరు వ్యాపారికి వేధింపులు
- 'ఫుడ్ జిహాద్' ఆరోపణలతో వేధింపులకు పాల్పడిన యూట్యూబర్లు
- ఘటనపై తీవ్రంగా స్పందించిన మంత్రి నారా లోకేశ్
- బాధితుడు వలీకి క్షమాపణ చెబుతూ ట్వీట్
- త్వరలోనే వలీని కలుస్తానని, కోవా బన్ తింటానని హామీ



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలోని మేడారం జాతరలో కర్నూలుకు చెందిన ఓ చిరు వ్యాపారి వేధింపులకు గురికావడం పట్ల ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, బాధితుడైన వలికి బహిరంగంగా క్షమాపణ చెప్పారు. వివరాల్లోకి వెళితే, కర్నూలు జిల్లాకు చెందిన వలీ అనే చిరు వ్యాపారి మేడారం జాతరలో కోవా బన్ అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో కొందరు యూట్యూబర్లు అతడిని అడ్డుకుని,

- మిగతా 2లో...

# నేడు ఏపీలో బిల్ గేట్స్ పర్యటన

- సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌తో కీలక అంశాలపై గేట్స్ చర్చలు
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో సహకారంపై ప్రధానంగా దృష్టి
- ఆర్‌టీజీఎస్ కేంద్రం, ఉండవల్లి పొలాలను సందర్శించనున్న బిల్ గేట్స్
- గేట్స్ ఫౌండేషన్ సహకారంతో సంజీవని ప్రాజెక్టును విస్తరించనున్న ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్:మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపక అధినేత బిల్ గేట్స్ సోమవారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కీలక రంగాల్లో భాగస్వామ్యంపై చర్చించేందుకు ఆయన తన బృందంతో కలిసి ఏపీకి వస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌లతో సమావేశమవుతారు. ఆదివారం అందిన సమాచారం ప్రకారం, సోమవారం ఉదయం 10 గంటలకు బిల్ గేట్స్ సచివాలయానికి చేరుకుంటారు. ముందుగా రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రాన్ని సందర్శించి, పాలనలో సాంకేతికత వినియోగాన్ని పరిశీలిస్తారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, అధికారులతో బిల్ గేట్స్ బృందం సమావేశమవుతుంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటికే అమలవుతున్న ప్రాజెక్టులను మరింతగా విస్తరించడంపై ఈ భేటీలో ప్రధానంగా చర్చిస్తారు. 'స్వర్ణాంధ్ర విజన్-2047' లక్ష్యాల సాధనకు చేపట్టిన సంస్కరణలు, ప్రజారోగ్యం, వ్యవసాయం, విద్య, మెడ్‌టెక్, సంజీవని వంటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్ గేట్స్‌కు ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. ముఖ్యంగా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో నడుస్తున్న 'సంజీవని' ప్రాజెక్టు పనితీరును ప్రభుత్వం ఆయనకు ప్రత్యేకంగా వివరించనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందించి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. సమావేశాల అనంతరం, బిల్ గేట్స్ బృందం అమరావతిలోని ఉండవల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తుంది. అక్కడ డ్రోన్లు, ఏఐ టెక్నాలజీ సహాయంతో చేపడుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను పరిశీలించనుంది.



## జనసేనకు భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్

- శివరాత్రి పర్వదినాన జనసేనకు శుభారంభం
- పార్టీకి రూ.2 కోట్ల విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్
- పార్టీ కోసం శ్రమించే వారే తమకు ముఖ్యమని ప్రకటన

పెన్ పవర్ డెస్క్:శివరాత్రి పండుగ రోజు జనసేన పార్టీకి మరో శుభారంభం అయింది. పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్వయంగా తొలి సభ్యత్వం తీసుకుని పార్టీకి రూ. 2 కోట్ల విరాళం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీ భావజాలాన్ని లోతుగా అర్థం

- మిగతా 2లో...



## బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

- ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బీఎన్‌పీ
- నూతన ప్రభుత్వాన్ని స్వాగతిస్తూ భారత విదేశాంగ శాఖ ప్రకటన
- ఫిబ్రవరి 17న ఢాకాలో జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం
- దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు పురుష ప్రధాని రాక

పెన్ పవర్ డెస్క్:బంగ్లాదేశ్‌లో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రభుత్వం తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమం ఫిబ్రవరి 17న రాజధాని ఢాకాలో జరగనున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇటీవల జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంటరీ ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని

మిగతా2లో

### తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో

## హోరెత్తుతున్న శైవ క్షేత్రాలు


### మహాశివరాత్రి

### భక్తులతో కిటకిటలాడుతున్న శివాలయాలు

### తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లోని శైవక్షేత్రాలు 'ఓం నమః శివాయ' నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఆదివారం (ఫిబ్రవరి 15) తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తడంతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తోంది. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన శ్రీశైలం, వేములవాడ, కాళేశ్వరం, కోటిపల్లి సహా అన్ని శివాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర నదుల్లో స్నానాలు ఆచరించిన భక్తులు,

- మిగతా 2లో...




## రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు



- యూఎస్, ఈయూ వాణిజ్య ఒప్పందాలపై కాంగ్రెస్ ఆరోపణలు
- ఖండించిన అమిత్ షా
- రైతు, పాడి, మత్స్య రంగాలకు పూర్తి రక్షణ కల్పించామని వెల్లడి
- యూపీఏ, ఎన్డీయే వ్యవసాయ బడ్జెట్లను పోల్చిన హోంమంత్రి
- విషయంపై చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి బహిరంగ సవాల్

పెన్ పవర్ డెస్క్:అమెరికా, యూరోపియన్ యూనియన్‌లతో భారత్ ఇటీవల కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాల వల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందంటూ కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రంగా ఖండించారు. రైతుల విషయంలో కాంగ్రెస్, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీ అబద్ధాలు ప్రచారం చేస్తూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రతి ఒప్పందంలోనూ వ్యవసాయం, పాడి, మత్స్య రంగాల ప్రయోజనాలకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించిందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం గాంధీనగర్‌లో దేశంలోనే తొలి సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థను

- మిగతా 2లో...



## అమెరికాతో ట్రేడ్ డీల్:

### ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

- అమెరికా వాణిజ్య ఒప్పందంపై మోదీ సర్కార్‌పై రాహుల్ దాడి
- ప్రధాని మోదీకి 5 సూటి ప్రశ్నలు సంధించిన రాహుల్
- ఈ ఒప్పందం రైతులకు ద్రోహం చేయడమేనని ఆరోపణ
- జీఎం పంటలు, సోయా, పాల రంగాలపై ప్రభావంపై ఆందోళన
- భారత వ్యవసాయంపై అమెరికా పట్టు సాధిస్తుందని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, మోదీ ప్రభుత్వంపై తన దాడిని మరింత తీవ్రతరం చేశారు. ఈ ఒప్పందం భారత రైతులకు చేసిన ద్రోహమని ఆరోపిస్తూ,

- మిగతా 2లో...



## 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఏపీ బడ్జెట్ పునాది

పెన్ పవర్ డెస్క్: ఏపీ బడ్జెట్ ప్రగతిశీల బడ్జెట్ అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులతో ఆయన ఆడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లను సమ్మిళితం చేస్తూ ప్రజలకు వివరించాలని సూచించారు. "శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్.. రాష్ట్రాభివృద్ధికి ఒక స్పష్టమైన రోడ్‌మ్యాప్.

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# జగన్ డెసిషన్ బూమరాంగ్ అవుతోందా ?

ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత జగన్ ఒక నిర్ణయం తీసుకున్నారు అంటే వెనక్కి వెళ్ళారు అని అంటారు. మరి ఆ సంగతి పక్కన పెడితే అసెంబ్లీకి జగన్ ఆయన ఎమ్మెల్యేలు హాజరయ్యే విషయంలో మాత్రం పట్టుదలగానే ఉన్నారని అంటున్నారు. తమకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వెళ్తామని వైసీపీ అధినేత అంటున్నారు. రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ అలా లేవని అధికార పక్షం చెబుతోంది. దానికి ఎన్నో ఉదాహరణలు కూడా చూపిస్తోంది. అయితే దీని మీద న్యాయ పోరాటం చేస్తున్నామని వైసీపీ అంటోంది. ఈలోగా ఇరవై నెలలు గడచిపోయాయి. అంటే మూడవ వంతు అన్న మాట.

**ప్రజలు కోరుకునేది అదే :**

నిజానికి ఎమ్మెల్యేగా గెలిచిన వారు అసెంబ్లీకి తప్పనిసరిగా వెళ్లాల్సి ఉంటుంది. వారిని గెలిపించేది ప్రజలు ఎమ్మెల్యేగానే. వారు మంత్రి అవుతారా లేక ముఖ్యమంత్రి అవుతారా లేదా ప్రతిపక్ష నేత అవుతారా అన్నది ప్రజలు ఎవరూ ఆలోచించి ఓటేయరు. ఒక వేళ వారు కీలక స్థానాలలోకి వెళ్ళినా వారు ఆ ప్రాంతానికి ఎమ్మెల్యేగానే ఉంటారు. హోదా వల్ల వారికి అదనంగా ప్రయోజనం చేకూరే అవకాశం ఉండొచ్చు కానీ బేసికల్ గా అయితే తమ ఎమ్మెల్యే నియోజకవర్గం సమస్యల గురించి అసెంబ్లీలో ప్రస్తావిస్తారని ఓటేస్తారని వారు ఆశిస్తారు. మరి ఎమ్మెల్యేగా గెలిచిన వారు సభకు వెళ్లకపోతే ప్రజా తీర్పునకు మూల నిర్వచనానికీ కూడా విఘాతం కలుగుతుందని మేధావులు అంటున్నారు.

**అసెంబ్లీకి దూరం ఎందుకు :**

వైసీపీ విషయానికి వస్తే తమకు అసెంబ్లీలో మాట్లాడటానికి మైక్ ఇవ్వరని అంటోంది. సభకు వస్తే తాము తప్పకుండా అవకాశం ఇస్తామని స్పీకర్ చెబుతూ వస్తున్నారు. మరి అది ఏమిటో తెలియాలీ అంటే తప్పకుండా వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లాల్సి ఉంటుంది. కానీ వైసీపీ మాత్రం హాజరు కావడం లేదు. జగన్ వరకూ చూసుకుంటే ఆయన వెళ్లకపోయినా తన ఎమ్మెల్యేలను అయినా సభకు పంపించాల్సి ఉంది అని అంటున్నారు. ఇరవై నెలల కూటమి పాలనలో ఎన్నో ప్రజా సమస్యల మీద విపక్షంగా వైసీపీ ప్రశ్నించాల్సి ఉంది. అలా అసెంబ్లీ నుంచి ప్రశ్నిస్తే దానికి వచ్చే మైలేజ్ కానీ జనాల నుంచి వచ్చే స్పందన కానీ వేరు అని అంటున్నారు.

**అవమానాలు తప్పవా :**

ఇక వైసీపీ ఎమ్మెల్యేలు సభకు వస్తే అవమానిస్తారు అన్నది కూడా ఉంది. అలా అవమానిస్తే వాటిని ఫేస్ చేసేందుకు కూడా సిద్ధంగా ఉండాలని అంటున్నారు అపుడే జనంలో సానుభూతి అయినా పెరుగుతుంది అని అంటున్నారు. గతంలో చంద్రబాబుని వైసీపీ వారు నిండు అసెంబ్లీలో చేసిన కామెంట్స్ వల్లనే ఆయన సభకు ఇంకా రెండేళ్ళు సమయం ఉండగా నమస్కారం పెట్టి బయటకు వెళ్ళారు తిరిగి సీఎం అయ్యారు. అందువల్ల ఈ రోజు అవమానం రేపటి రోజున అధికారం అన్నది ఎన్నో సార్లు రుజువు అయింది. అయినా ప్రజల కోసం అవమానం పడతామని వైసీపీ నిర్ణయించుకుంటే ఆ లెక్కే వేరు అని అంటున్నారు.

**రాంగ్ అవుతోందిగా :**

వైసీపీ సభకు దూరంగా ఉండడం రాంగ్ డెసిషన్ గానే అంటున్నారు. వైసీపీలోనూ దీని మీద అంతర్గతంగా మధనం జరుగుతోంది కానీ ఎవరూ బయటకు ఏమీ అనలేని పరిస్థితి ఉంది అని అంటున్నారు. రాజకీయాలు అన్నవి ప్రజలకు సంబంధించినవి. వాటిని ప్రజా కోణంలో నుంచే చూడాలి. వారి ఆలోచనలనే నాయకులు పరిగణనలోకి తీసుకోవాలి. ఆ విధంగా ఆలోచిస్తే వైసీపీ బంగారం లాంటి బడ్జెట్ సెషన్ అవకాశాలని వదులుకుంటోంది అని అంటున్నారు. ఈ విషయంలో వైసీపీ పునరాలోచన చేస్తే బాగుంటుంది అన్న సూచనలు వెలువడుతున్నాయి. కానీ అలా జరుగుతుందా అంటే ఏమో వేచి చూడాల్సిందే.

# ఏఐ నాయకత్వానికి అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ ఒక పూర్తిస్థాయి లీడర్‌గా ఎదిగే సత్తా ఉందని చాట్‌జీపీటీ సృష్టికర్త 'ఓపెన్‌ఏఐ' సీఈవో శామ్ ఆల్ట్‌మన్ ప్రశంసించారు. అందుకు అవసరమైన వనరులన్నీ భారత్ వద్ద ఉన్నాయని అన్నారు. భారత్‌లో చాట్‌జీపీటీని వారానికి 10 కోట్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నారని, ఇది తమకు ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అని ఆయన వెల్లడించారు. ఫిబ్రవరి 16 నుంచి న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభం కానున్న 'గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక మీడియా కథనంలో ఆయన మాట్లాడుతూ, అమెరికా తర్వాత భారత్‌లోనే తమకు అత్యధిక యూజర్లు ఉన్నారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి యూజర్లు కూడా భారత్ నుంచే ఉన్నారని, శాస్త్రీయ పరిశోధనల కోసం ఉద్దేశించిన 'ప్రిజమ్' అనే ఉచిత టూల్ వినియోగంలో భారత్ ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉందని వివరించారు. వచ్చే వారం తాను భారత్‌లో పర్యటించనున్నట్లు ఆల్ట్‌మన్ తెలిపారు. ఏఐని "భారత్‌లోనే, భారత్‌తోనే, భారత్ కోసమే" అభివృద్ధి చేసేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. గతేడాది ఢిల్లీలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని, ఈ ఏడాది కార్యకలాపాలను మరింత విస్తరించాలని యోచిస్తున్నట్లు చెప్పారు. ఏఐ ప్రయోజనాలను అందరికీ అందించేందుకు ప్రభుత్వంతో కొత్త భాగస్వామ్యాలు కుదుర్చుకునే అవకాశాలు ఉన్నాయని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఏఐని క్షేత్రస్థాయికి చేర్చడానికి 'యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీ' అనే త్రిముఖ వ్యూహాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. ఇటీవలే నాలుగు భారతీయ నగరాల్లో 200 మందికి పైగా ఎన్జీవో ప్రతినిధులకు చాట్‌జీపీటీ వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు పూర్తి... మహ్మద్ యూనస్ పరిస్థితేంటి?

బంగ్లాదేశ్ రాజకీయాల్లో ఒక కీలక అధ్యాయం ముగిసి, కొత్త శకం ప్రారంభమవుతోంది. 2024లో షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత తాత్కాలిక ప్రభుత్వ అధినేతగా దేశాన్ని నడిపించిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్, ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని బదిలీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించడంతో, ఆ పార్టీ చైర్మన్ తారిక్ రహ్మాన్ దేశ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. సుమారు 17 ఏళ్ల పాటు విదేశాల్లో ప్రవాస జీవితం గడిపిన ఆయన, ఇప్పుడు దేశ రాజకీయాల్లోకి పునరాగమనం చేస్తున్నారు.

ఫిబ్రవరి 17న జరగనున్న తారిక్ రహ్మాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారత ప్రధాని నరేంద్ర మోదీ సహా 13 దేశాల అధినేతలకు ఆహ్వానాలు పంపారు. దేశంలో స్థిరత్వం, సమగ్ర పాలన అందించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని తారిక్ రహ్మాన్ ఇప్పటికే ప్రకటించారు. ఈ అధికార మార్పిడి నేపథ్యంలో, మహ్మద్ యూనస్ భవిష్యత్తుపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. ఆయనకు రాజ్యాంగబద్ధమైన పదవి, ముఖ్యంగా రాష్ట్రపతి పదవి ఇవ్వాలనే డిమాండ్ సోషల్ మీడియాలో బలంగా వినిపిస్తోంది. యూనస్‌కు ఉన్న అంతర్జాతీయ ఖ్యాతిని ఉపయోగించుకుని, కొత్త ప్రభుత్వం దేశ దౌత్య సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. "దేశీయ వ్యవహారాలపై దృష్టి సారించే ప్రధాని, అంతర్జాతీయంగా పలుకుబడి ఉన్న రాష్ట్రపతి ఉంటే బంగ్లాదేశ్‌కు ఎంతో మేలు జరుగుతుంది" అని ప్రముఖ కాలమిస్ట్ డేవిడ్ బెర్గ్‌మాన్ వ్యాఖ్యానించారు.

ఈ ఊహాగానాలపై బీఎన్‌పీ వర్గాలు ఆచితూచి స్పందించాయి. ఎన్‌డీటీవీతో మాట్లాడుతూ తారిక్ రహ్మాన్ సన్నిహిత సలహాదారు హుమయూన్ కబీర్, "తారిక్ రహ్మాన్ సమగ్ర పాలనకు కట్టుబడి ఉన్నారు. దేశంలోని అత్యుత్తమ మేధావుల సేవలను వినియోగించుకోవాలని ఆయన భావిస్తున్నారు. యూనస్‌తో చర్చలు జరిగాయి కానీ, ఏ పదవీ ఖరారు కాలేదు. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు, దేశ ప్రయోజనాల దృష్ట్యా ఉత్తమ నిర్ణయం తీసుకుంటారు" అని పేర్కొన్నారు. అయితే, ఈ ప్రచారాన్ని మహ్మద్ యూనస్ కార్యాలయం ఖండించింది. ఆయన ప్రెస్ సెక్రటరీ షఫీకుల్ ఆలం మాట్లాడుతూ, "యూనస్‌కు రాజకీయాల్లోకి వచ్చే ఆసక్తి ఎంతమాత్రం లేదు. ఆయన ఏ రాజ్యాంగ పదవినీ ఆశించడం లేదు. తన పాత బాధ్యతల్లోకి తిరిగి వెళతారు. పేదరికం, నిరుద్యోగం, కర్బన ఉద్గారాలు లేని సమాజం అనే తన 'త్రీ జీరోస్' లక్ష్య సాధన కోసం పనిచేస్తారు. కొత్త సామాజిక వ్యాపారాలు ప్రారంభిస్తూ, యువతతో కలిసి పనిచేయడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తారు" అని స్పష్టం చేశారు. తన పరిమిత కాలంలో దేశంలో శాంతి, స్థిరత్వం తీసుకురావడంలో యూనస్ సఫలమయ్యారని, ఇప్పుడు బాధ్యతలను కొత్త ప్రభుత్వానికి అప్పగించి రాజకీయాల నుంచి పూర్తిగా వైదొలగనున్నారని ఆయన వివరించారు. దీంతో యూనస్ రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది.

# జనసేనకు భారీ విరాళం ప్రకటించిన పవన్ కల్యాణ్

- మొదటి పేజి తరువాయి

చేసుకుని, సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేసే వారిని "ఉద్యమి"గా గౌరవిస్తామని తెలిపారు. పార్టీ పోరాటానికి బలం చేకూర్చి, నవతరంలో ప్రేరణ కలిగించే వారిని "సాధక్"గా, పరోక్షంగా సమయం, ఆర్థికం, సాంకేతికం, సేవా, మేధో సహకారాలు అందించే వారిని "ప్రదాత"గా ఇకపై పిలుస్తామని పవన్ కల్యాణ్ ప్రకటించారు. జనసేన పార్టీ ప్రారంభంలో 150 మందితో మొదలైందని, 2021లో మొదటి విడత సభ్యత్వంలో 90 వేలు నమోదు అయ్యాయని పవన్ తెలిపారు. గత ఎన్నికల ముందు ఆ సంఖ్య 6 లక్షలకు చేరిందని... ఎన్నికల తర్వాత 12.98 లక్షల సభ్యత్వాలు సాధించామని ఆయన గుర్తుచేశారు. చిన్న వ్యాపారులు, కూలీలు, చదువుకున్నవారు అందరూ ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారని, పార్టీ ఆశయాలకు అనుగుణంగా నడిచేవారే ముఖ్యమని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, పార్టీ అధ్యక్షుల రాజకీయ కార్యదర్శి పిడుగు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. గత సభ్యత్వ నమోదులో అత్యధిక సభ్యత్వాలు చేసినవారి సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది.

## మా డబ్బు, గిఫ్ట్‌లు మాకివ్వండి:

## ఇంటింటికి వెళ్లి అడుగుతున్న ఓడిపోయిన అభ్యర్థులు

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓడిపోయిన కొందరు అభ్యర్థులు తాము పోలింగ్‌కు ముందు పంచిన నగదు, చీరలు, ఇతర బహుమతులు ఇవ్వాలంటూ ఓటర్లను అడగటం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు ఓటర్లను ప్రభావితం చేయడానికి డబ్బుతో పాటు ఇతర బహుమతులు పంచుతుంటారు.

మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని మూడుచింతలపల్లి పొన్నాల వార్డులో ఓ అభ్యర్థి తాను పంచిన వాటిని తిరిగివ్వాలని ఓటర్లను అడుగుతున్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన మందు, చీరలు, డబ్బు తిరిగి ఇవ్వాలని ఈ వార్డులో ఓడిపోయిన ఓ అభ్యర్థి అడుగుతున్నారు. సదరు అభ్యర్థి ఇంటింటికి తిరుగుతూ తన బహుమతులు వసూలు చేసుకునే ప్రయత్నం చేయడం గమనార్హం. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లోని తొమ్మిదవ వార్డులో కూడా ఓ అభ్యర్థి తనకు ఎవరెవరు ఓటు వేశారు, ఎవరు వేయలేదో ఇంటింటికి వెళ్లి లెక్కలు వేసుకుంటున్నారు. తనకు ఓటు వేయని వారు తాను ఇచ్చిన బహుమతులను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని భువనగిరి మున్సిపాలిటీ లోనూ ఒకటో వార్డులో ఓడిపోయిన ఒక అభ్యర్థి తాను పంచిన చీరలు, హాట్ బాక్సులు తిరిగి ఇవ్వాలని ఇంటింటికి వెళుతున్నారు.

# బంగ్లా నూతన ప్రధాని ప్రమాణ స్వీకారానికి భారత్ ప్రతినిధిగా స్పీకర్ ఓం బిర్లా

- మొదటి పేజి తరువాయి

బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కీలక కార్యక్రమంలో స్పీకర్ పాల్గొనడం ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న బలమైన, చిరకాల స్నేహానికి నిదర్శనమని విదేశాంగ శాఖ తెలిపింది. "చరిత్ర, సంస్కృతి, పరస్పర గౌరవంతో ముడిపడి ఉన్న పొరుగు దేశంగా, తారిఖ్ రెహమాన్ నాయకత్వంలో ఏర్పడుతున్న ఎన్నికైన ప్రభుత్వాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతిస్తోంది. ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి ఉన్న బంగ్లాదేశ్‌కు మా మద్దతు ఎల్లప్పుడూ ఉంటుంది" అని ప్రకటనలో పేర్కొంది.

ఫిబ్రవరి 12న 300 స్థానాలకు గాను 299 స్థానాలకు పార్లమెంటరీ ఎన్నికల పోలింగ్ జరిగింది. ఇప్పటివరకు ప్రకటించిన ఫలితాల ప్రకారం, బీఎన్‌పీ 209 సీట్లు గెలుచుకుంది. మరోవైపు, జమాత్-ఎ-ఇస్లామీ 68 స్థానాలు కైవసం చేసుకుంది. ప్రముఖ బంగ్లాదేశ్ పత్రిక 'ప్రొథోమ్ ఆలో' కథనం ప్రకారం, ఫలితాలు నిలిపివేసిన రెండు నియోజకవర్గాల్లోనూ బీఎన్‌పీ అభ్యర్థులే ఆధిక్యంలో ఉన్నారు.

ఫిబ్రవరి 17న జాతీయ సంసద్ భవన్‌లో కొత్తగా ఎన్నికైన సభ్యులతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఎ.ఎం.ఎం. నసీరుద్దీన్ ప్రమాణం చేయించనున్నారు. దాదాపు 35 ఏళ్ల తర్వాత బంగ్లాదేశ్‌కు ఒక పురుషుడు ప్రధానమంత్రి కానున్నారు. అయితే, గత 18 నెలల తాత్కాలిక ప్రభుత్వ హయాంలో పెరిగిన అశాంతి, తీవ్రవాదాన్ని అధిగమించడం కొత్త ప్రభుత్వానికి అతిపెద్ద సవాల్‌గా నిలవనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో శివ నామస్మరణతో హోరెత్తుతున్న శైవ క్షేత్రాలుం

శివనామ స్మరణ చేస్తూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి, స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో బారులు తీరారు. అలాగే, కాళేశ్వరంలోని ముక్తేశ్వర స్వామి ఆలయం, శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయం, కీసర, వరంగల్‌లోని చారిత్రక శివాలయాలు భక్తజన సంద్రంగా మారాయి. 'హర హర మహాదేవ', 'శంభో శంకర' అంటూ భక్తులు చేస్తున్న జయజయధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు దద్దరిల్లుతున్నాయి.

మహాశివరాత్రి సందర్భంగా ఆలయాల్లో రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వైభవంగా జరుగుతున్నాయి. రాత్రివేళ శివపార్వతుల కల్యాణ మహోత్సవాలు, జాగరణ కోసం ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ఆర్టీసీ (టీజీఎస్ఆర్టీసీ) పలు శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. భక్తులకు తాగునీరు, మజ్జిగ వంటి సౌకర్యాలను కల్పించారు. శివపార్వతులు ఏకమైన ఈ పవిత్రమైన రోజున ఉపవాసం ఉండి, రాత్రంతా జాగరణ చేస్తే సకల పాపాలు తొలగి పుణ్యఫలం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

# కోవా బన్ వ్యాపారి వలీకి అండగా ఉంటాం

- మొదటి పేజి తరువాయి

'ఫుడ్ జిహాద్' చేస్తున్నావంటూ ఆరోపణలు చేశారు. అంతేకాకుండా, అతడితో బలవంతంగా కోవా బన్ తినిపించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వీడియోపై స్పందించిన నారా లోకేశ్, తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా ఒక పోస్ట్ చేశారు. "ప్రియమైన సోదరుడు వలీ గారూ, మీకు ఈ బాధ కలిగినందుకు చాలా విచారంగా ఉంది. ఇలాంటి విభజనకరమైన, మతతత్వ ప్రవర్తనకు మన తెలుగు సమాజంలో చోటు లేదు. మన సమాజం ఎల్లప్పుడూ సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావంతో నిలిచింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

అంతేకాకుండా, "త్వరలో మిమ్మల్ని కలిసి మీ ఫేమస్ కోవా బన్ రుచి చూడాలని ఎదురుచూస్తున్నాను! మనమంతా కలిసి ఉందాం" అంటూ వలీకి భరోసా ఇచ్చారు. లోకేశ్ స్పందనపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అమెరికాతో ట్రేడ్ డీల్:

## ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ 5 ప్రశ్నలు

- మొదటి పేజి తరువాయి

ఆదివారం సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీకి ఐదు సూటి ప్రశ్నలు సంధించారు. ఈ వివాదాస్పద ఒప్పందంపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వాణిజ్య ఒప్పందం వల్ల జన్యుపరంగా మార్పు చేసిన (జీఎం) పంటలు, సోయా రైతులపై పడే ప్రతికూల ప్రభావాల గురించి రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో రైతులకు అందుబాటులో ఉన్న రక్షణ కవచాలను కేంద్ర ప్రభుత్వం తొలగిస్తోందని ఆరోపించారు. ఈ ఒప్పందం కేవలం నేటి సమస్య కాదని, భవిష్యత్తులో భారత వ్యవసాయ వ్యవస్థపై మరో దేశానికి దీర్ఘకాలికంగా పట్టును అప్పగించడమేనని ఆయన విమర్శించారు. రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేస్తూ, ప్రధాని మోదీ సమాధానం చెప్పాలంటూ రాహుల్ గాంధీ ఈ ఐదు ప్రశ్నలను లేవనెత్తారు.

1. డీడీజీ (డిస్టిల్లర్స్ డ్రైడ్ గ్రెయిన్) దిగుమతి చేసుకోవడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? అంటే, అమెరికా జీఎం మొక్కజొన్నల నుంచి తీసిన ధాన్యాన్ని మన పశువులకు మేపడమేనా? ఇది మన పాల పరిశ్రమను అమెరికా వ్యవసాయ వ్యవస్థతో అనుసంధానం చేయదా?
2. జీఎం సోయా నూనె దిగుమతులకు అనుమతిస్తే.. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మన సోయా రైతుల పరిస్థితి ఏంటి? మరోసారి ధరల పతనాన్ని వారు ఎలా తట్టుకుంటారు?
3. మీరు చెబుతున్న 'అదనపు ఉత్పత్తులు' జాబితాలో ఏముంటాయి? పప్పుధాన్యాలు, ఇతర సున్నితమైన పంటలను కూడా కాలక్రమేణా అమెరికా దిగుమతులకు తెరవాలనే ఒత్తిడికి ఇది సంకేతమా?
4. 'వాణిజ్యేతర అడ్డంకులు' తొలగించడం అంటే ఏమిటి? జీఎం పంటలపై భారత్ తన వైఖరిని నీరుగార్చాలా? సేకరణను బలహీనపరచాలా? లేదా భవిష్యత్తులో కనీస మద్దతు ధర, బోనస్‌లను నిర్వీర్యం చేయాలా?
5. ఒక్కసారి ఈ తలుపు తెరిస్తే, అది ఏటా మరింత పెద్దది కాకుండా ఎలా నివారిస్తాం? రైతులకు తగిన రక్షణ కవచాలు ఉంటాయా? లేక ప్రతి చర్చలోనూ మరిన్ని పంటలను బేరసారాలకు పెడతారా?

ఈ ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

# రైతులకు పూర్తి రక్షణ... రాహుల్ గాంధీ తప్పుదోవపట్టిస్తున్నాడు

- మొదటి పేజి తరువాయి

ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటులో నిలబడి రాహుల్ గాంధీ రైతుల ప్రయోజనాలను కాపాడతామని మాట్లాడటం నవ్వొస్తోందని ఎద్దేవా చేశారు. దేశ ప్రజలను తప్పుదోవ పట్టించడంలో కాంగ్రెస్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని, ఇప్పుడు వాణిజ్య ఒప్పందాల గురించి అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరిగిన ప్రతి చర్చలోనూ రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలకు ఎలాంటి హాని కలగకుండా సంపూర్ణ భద్రత కల్పించారని హామీ ఇచ్చారు. గత యూపీఏ ప్రభుత్వంతో పోలుస్తూ తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి చేసిన మేలును అమిత్ షా వివరించారు. మన్మోహన్ సింగ్ హయాంలో కేవలం రూ. 26,000 కోట్లుగా ఉన్న వ్యవసాయ బడ్జెట్, ప్రధాని మోదీ నాయకత్వంలో రూ. 1,29,000 కోట్లకు పెరిగిందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో కనీస మద్దతు ధరకు ఆహార ధాన్యాల సేకరణ పదిహేను రెట్లు పెరిగిందని తెలిపారు. "70 ఏళ్లుగా కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడిందే తప్ప చేసిందేమీ లేదు. కానీ మా ప్రభుత్వం, రైతులు అప్పులపాలు కాకుండా ఉండేందుకు ఏటా రూ. 6,000 నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది" అని ఆయన అన్నారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ పాడి రంగం దెబ్బతింటుందన్న విమర్శలను కూడా ఆయన తిప్పికొట్టారు. ప్రభుత్వం పాడి ఉత్పత్తి రంగాన్ని బలహీనపరచలేదని, మరింత బలోపేతం చేసిందని స్పష్టం చేశారు. అన్ని ఒప్పందాలలోనూ పాడి రంగానికి పూర్తి రక్షణ కల్పించామని పేర్కొన్నారు. ఈ అంశంపై ఎక్కడైనా, ఎప్పుడైనా బహిరంగ చర్చకు రావాలంటూ రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. బీజేపీ యువమోర్చా అధ్యక్షుడు కూడా ఈ చర్చకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. గత నెలలో భారత్, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై చర్చలు ముగియడం, అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరడం వంటి పరిణామాల నేపథ్యంలో అమిత్ షా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఏపీ బడ్జెట్ పునాది

- మొదటి పేజి తరువాయి

సంపద సృష్టి, అభివృద్ధి, సంక్షేమం ఆధారంగా బడ్జెట్ రూపొందించారు. రూ. 3.32 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించడం సాహసోపేతమైన చర్య. రెవెన్యూ లోటును 1.86 శాతానికి పరిమితం చేయడం ఆర్థిక క్రమశిక్షణకు నిదర్శనం. 'వికసిత్ ఏపీ' ద్వారా 'వికసిత్ భారత్' నిర్మాణానికి ఈ బడ్జెట్ పునాది వేస్తోంది" అని మాధవ్ అన్నారు.

## శివ నామస్మరణతో మారుమోగిన శివాలయాలు





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**మహాశివరాత్రి వేడుకలను పురస్కరించు కుని మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మారుమోగాయి. మండలంలోని ఏటిపల్లి కుసుమరాయి గొరగొమ్మి వేమనపల్లి తదితర గ్రామాల్లో గల శివాలయాల్లో ఆదివారం తెల్లవారుజాము నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు అలాగే మండలము నుండి భక్తులు రంప గురబంద పుతి గుంట తదితర గ్రామాల్లో గల శివాలయాలకు తరలి వెళ్లారు.ఏటి పల్లి గ్రామంలో రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మామిడి భద్రరాజు ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు తరలివచ్చి పెద్దేరులో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్న. ఈ సందర్భంగా గంగవరం గ్రామానికి చెందిన మడకం వెంకటరమణ కుసుమ కుమారి దంపతులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 2000 మంది భక్తులకు అన్నదానం వితరణ జరిగింది. గిరిజన అర్చకుడు రామకృష్ణారెడ్డి, పూజలు నిర్వహించారు. స్వామివారిని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి దంపతులు దర్శించుకున్నారు. సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కట్రం చిన్నాలరావు దొర, బోయిన అబ్బాయి రెడ్డి గంగవరం యువసేన యువకులు పాల్గొన్నారు.

# నేటి పి జి ఆర్ ఎస్, రెవెన్యూ క్లినిక్ రద్దు

**జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్**



**గంగవరం/ రంపచోడవరం, ఫిబ్రవరి 15 :** మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 16వ తారీకున సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) రెవిన్యూ క్లినిక్ అనివార్య కారణాల వలన ఈవారం రద్దు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 16వ తారీకు సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవిన్యూ క్లినిక్ అనివార్య కారణాల వలన ఈ వారం రద్దు చేయడం జరిగిందని అదేవిధంగా సోమవారం మహాశివరాత్రి సందర్భంగా ఐచ్చిక సెలవు దినముగా ప్రకటించడంతో డివిజన్ స్థాయిలో నిర్వహించవలసిన పి జి ఆర్ ఎస్ కార్యక్రమం ఈ వారం రద్దు చేస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## మండల రైతువిభాగం అధ్యక్షులుగా ముత్యాలరావు



**వి.ఆర్.పురం పెన్.పవర్.ఫిబ్రవరి.15:**మాజీ రాష్ట్రముఖ్యమంత్రి జగన్ మోహన్,రెడ్డి తూర్పుగోదావరి ఉమ్మడిజిల్లా ఎమ్మెల్సీఅనంత బాబు,రంపచోడవరం కోఆర్డినేటర్,నాగులపల్లి ధనలక్ష్మి,ఆదేశాలనుసారం వి.ఆర్.పురం మండల రైతువిభాగం అధ్యక్షుడుగా గూటాల ముత్యాలరా వు,నియమించినట్టు వై.సి.పి.పార్టీ మండలకమిటీ సమావేశంలో వై.సి.పి.పార్టీ మండలఅధ్యక్షులుమాది రెడ్డిసత్తిబాబు ప్రకటించారు.అనంతరంమండలరైతు విభాగంఅధ్యక్షులు గూటాల ముత్యాలరావు,మాట్లా డుతూ వై.సి.పి.పార్టీలో కష్టపడి పనిచేసే కార్యకర్తలను వై.సి.పి.పార్టీ అధిష్టానంతప్పకుండా గుర్తిస్తుందని,వై.సి. పి.కార్యకర్తలందరూ కలసికట్టుగా ఉండి పార్టీ బలోపేతా నికికృషి చేయాలని,కోరారు.వై.సి.పి.పార్టీఅధిష్టానంఆదే శాలనుసారం మండల రైతువిభాగం అధ్యక్షులుగాగూటా లముత్యాలరావు,నియమించినందుకు ఎమ్మెల్సీ అనంత బాబు,కోఆర్డినేటర్,ధనలక్ష్మి,కు ప్రత్యేక కృతజ్ఞతలు ఒక ప్రకటనలో తెలిపారు.




పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# భక్తులతో కిక్కిరిసిన శివాలయాలు, పుష్కర ఘాట్లు





- శివనామస్మరణతో మార్మోగిన నగరం
- ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో భక్తుల రద్దీని క్రమబద్ధీకరించిన పోలీసులు
- వితరణ, సేవా గుణాన్ని చాటిచెప్పిన స్వచ్ఛంద సంస్థలు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం నగరంలోని శివాలయాలు,పుష్కర ఘాట్లు లతో భక్తులతో కిక్కిరి సాయి. నగరమంతా భక్తుల శివ నామస్మరణ తో మార్మోగింది.

మహాశివరాత్రి సందర్భంగా నగరంలో శ్రీ మార్కండేయ స్వామి ఆలయం, శ్రీ కోటిలింగేశ్వర స్వామి ఆలయం, శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయం, సారంగధరేశ్వర ఆలయం తదితర శివాలయలు విద్యుత్ దీపాల అలంకరణలతో ముస్తాబు అయ్యాయి. ఆదివారం తెల్లవారుజాము నుంచే శివపార్వతులకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు , సహస్ర ,లలిత పారాయణం వేద పండితుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోదావరి నది తీరాన ఉన్న పుష్కర్ ఘాట్, కోటిలింగాల ఘాట్ , సరస్వతి ఘాట్ గౌతమి ఘాట్ , ధవలేశ్వరంలోని రామ పాదాల రేవు ఘాట్ భక్తుల వేలాదిమంది భక్తుల పుణ్యస్నానాలతో కిక్కిరిసాయి. ఆయా పుష్కర ఘాట్ ల వద్ద రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో భద్రత ఏర్పాట్లు చేశారు. భక్తుల కదలికలను, పిల్లలను, వృద్ధులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన సీసీ కెమెరాలు, డ్రోన్లు వంటి అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిరంతరం పర్యవేక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేసి ఆయా ఘాట్లోనూ భక్తుల రద్దీని, ట్రాఫిక్ సమస్యను సమర్థవంతంగా నియంత్రిస్తూ ఈ మహాశివరాత్రి ఉత్సవాలను, ఏర్పాట్లను రాబోయే 2027 గోదావరి పుష్కరాల మోడల్ గా తీసుకున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నగర పరిసర ప్రాంతాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శివాలయాలు వద్ద భక్తుల సాధారణ, ప్రత్యేక క్యూ లైన్లు దర్శనం కోసం ఏర్పాటు చేశారు. ఆలయాల వద్ద టెంట్లు, భక్తులకు తాగునీరు, పిల్లలకు పాలు, మజ్జిగ వంటి మౌలిక సౌకర్యాలను ఆయా ఆలయాల ధర్మకర్తల మండళ్ళ కమిటీలు ఏర్పాటు చేశాయి. శివాలయాలు, స్నానపు ఘాట్లు, నగరంలోని పలు కూడళ్లు వద్ద

పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు, పిల్లలకు పులిహోర, దద్దోజనం, పరమాన్నం, మంచినీరు, పాలు మజ్జిగ బిస్కెట్లు వితరణ చేసి సేవా గుణాన్ని చాటి చెప్పాయి. పోలీసులు ఘాట్లు శివాలయల వద్ద భారీ బందోబస్తు, ముందస్తు విపత్తు నివారణ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా నగరంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదని, ప్రశాంతంగా జరిగాయని అధికారులు పేర్కొన్నారు.





## మునికూడలిలో శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించిన కంబాల



**నూతన ఆలయ నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం**

**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15 :**సీతానగరం మండలంలోని మునికూడలి గ్రామంలోని శ్రీశ్రీశ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని గ్రామస్తులు, కమిటీ సభ్యుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆదివారం సందర్శించారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు హారతులు పట్టి, పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆలయం అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనక దుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణాలకు పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా లక్ష రూపాయలు విరాళం చెక్ ను కమిటీ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధి, హిందూ ధర్మ పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని అన్నారు. అలాగే పేదల అభ్యున్నతకు సహాయ, సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. అనంతరం దేవాన్ష్ ఘాట్ ను సందర్శించారు. శ్రీ ఉమాపార్వతి సోమేశ్వర స్వామి, శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి ఆలయాలను దర్శించారు. అలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివరాత్రి వేడుకలు





**గంగవరం /రంపచోడవరం, ఫిబ్రవరి 15 :-** ప్రతి మానవుడు భక్తి శ్రద్దలతో భగవంతుని ఆరాధించిన ఎడల ఆ పరమశివుడు ఎల్లప్పుడు మనకి కాపాడతాడని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. ఆదివారం రంపచోడవరం మండలంలోని రంప గ్రామంలో శివరాత్రి ఉత్సవాలు సందర్భంగా శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పోలవరం, జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ వారికి అర్చకులు అయినటువంటి ప్రసన్న కుమార్, వేదమంత్రాలతో పరమశివునికి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ మాట్లాడుతూ రంప గ్రామములో కొండపైన, కొండ క్రింద 12వ శతాబ్దపు నాటి పురాతన చరిత్ర కలిగిన చోళ రాజుల కాలంలో నాగ వంశీయులచే ప్రతిష్టింపబడిన శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయమని అదేవిధంగా ఈఆలయం చాలా చరిత్ర కలిగిన ఆలయమని ఆయన అన్నారు.ఈ శివరాత్రి ఉత్సవాలు ఈనెల 15వ తారీకు నుండి 19వ వరకు మొత్తం ఐదు రోజులపాటు శివరాత్రి ఉత్సవాలు శివాలయ ఉత్సవాల కమిటీ ద్వారా నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ఎక్కడికి అక్కడ ఏర్పాట్లు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం ద్వారా త్రాగునీటి సౌకర్యం, ప్రత్యేక మెడికల్ క్యాంప్, ఎక్కడికక్కడ పారిశుధ్య కార్యక్రమాలు, ఎటువంటి అల్లర్లకు తావు లేకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని అన్ని గ్రామాలలోని ప్రజలు పరమశివుని అనుగ్రహంతో మంచి పంటలు పండాలని, మంచి వర్షాలు పడాలని, అందరికీ మంచి ఆరోగ్యం ప్రసాదించాలని ఆ పరమశివునికి ప్రార్థించడం జరిగిందని ఆయన తెలిపారు.శివాలయానికి వచ్చిన భక్తులకు వర్తక సంఘాలు,డోనర్లు భోజన సౌకర్యం, త్రాగునీటి సౌకర్యం, పులిహోర ప్రసాదం భక్తులకు అందజేయడం జరిగింది. ఈ సంవత్సరం రంప భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు పరమశివుని నీ దర్శించుకోవడం జరిగిందని ఆయన తెలిపారు.ముందుగా జాయింట్ కలెక్టర్ వారిని ఆలయ కమిటీ వారు ఘనంగా స్వాగతం పలకడం జరిగింది. ఈకార్యక్రమంలో తాసిల్దార్ పి.బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో హరిబాబు,పంచాయతీ కార్యదర్శి రామరాజు, సర్కిల్ ఇన్స్పెక్టర్ పివిఎస్ నాయుడు,సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు,వైద్యాధికారిని శ్వేత, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సిహెచ్ నిర్మల కుమారి, పంచాయతీ సర్పంచ్ చెదల శ్రీదేవి, ఎంపీపీ బంధం శ్రీదేవి, శివాలయ కమిటీ సభ్యులు సారపు శాంతిరాజు, టోనీ బాబు, జె.సుందర్, వీఆర్వోలు చిన్న రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

# శివనామస్మరణతో దద్దరిల్లిన శైవ క్షేత్రాలు..





**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి15:** మహాశివరాత్రి సందర్భంగా ఏజెన్సీ ప్రాంతంలో శైవ క్షేత్రాలు అన్ని శివనామ స్మరణతో దద్దరిల్లాయి. తెల్లవారుజామున మూడు గంటల నుండి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారికి అర్చనలు అభిషేకాలు నిర్వహించారు. అడ్డతీగల మండలంలో డి. భీమవరం రోడ్డులో ప్రసిద్ధిగాంచిన వందల సంవత్సరాల క్రితం స్వయంభుగా వెలసిన ఉబ్బలింగేశ్వర ఆలయంలో తెల్లవారుజాము నుండి భక్తులు కిటకిటలాడారు. భక్తులు అర్చనలు అభిషేకాలు నిర్వహించిన అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే గ్రామంలో వేంచేసియున్న ఉమా రామలింగేశ్వర ఆలయంలోనూ తెల్లవారుజాము నుండి అభిషేకాలు నిర్వహించారు. అడ్డతీగల మండలం బొంగరాలు పాడు శివాలయంలో తెల్లవారుజాము నుండి భారీ స్థాయిలో భక్తులు పోటెత్తారు. అడ్డతీగల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులను క్యూ లైన్ లో పంపించడం ట్రాఫిక్ నియంత్రణ చేయడం పోలీసులకు సవాల్ గా నిలిచింది. అడ్డతీగల మండలంలో ఉబ్బ లింగేశ్వర స్వామి ఆలయము, బొంగరాలు పాడు శైవ క్షేత్రాలలో మధ్యాహ్నం 30 వేల మందికి అన్న వితరణ జరుగుతుందని ఆలయ కమిటీల అంచనా.

## వ్యర్థాలు తీయరు..మురుగు పారదు



**పెన్ పవర్, ఫిబ్రవరి15:** దెందులూరు మండలం పోతునూరు పంచాయితీ పరిధిలో కేతవరం ఎస్సీకాలనీలోని కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలతో మూసుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. గృహాల్లోని వాడకం వెళ్లే మార్గం లేక రోజుల తరబడి నిలిచిపోతుండడంతో దోమలకు ఆవాసంగా మారిందని వాపోతున్నారు. పంచాయితీ సిబ్బంది కాలువలో వ్యర్థాలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## స్వచ్ఛభారత్ పై ఏదీ చిత్తశుద్ధి ?



**ఏలూరు ఫిబ్రవరి 15 పెన్‌పవర్ :** పర్యావరణ పరిరక్షణ,పరిసరాల పరిశుభ్రత అంటూ ప్రకటనలు చేయడం మినహా ఆచరణపై పాలకుల్లో దృష్టి సారించడం లేదు. ఎఇందుకు జాల్లా కేంద్రం ఏలూరులోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలోని అంబేద్కర్ పార్క్ నిదర్శనంగా నిలుస్తోంది. విద్యాశాఖాధికారి కార్యాలయంఆవరణలోని సర్వశిక్షఅభియాన్,పరీక్షల నిర్వహణ కేంద్రాలు ఉన్నాయి. కార్యాలయ ఆవరణ ఎండిపోయిన ఆకులతో పార్క్ ఆవరణ నిండిపోయింది. స్వచ్ఛ భారత్ పేరుతో ఊరంతా ప్రచారం చేసే అధికారులు తమ కార్యాలయాల పరిసరాలపై దృష్టిసారించాల్సిన అవసరముంది.

## శివరాత్రి సందర్భంగా జగన్నాధపురంలో అన్న సమారాధన.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** మండలంలోని జగన్నాధపురం గ్రామంలో కొలువైన శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. గ్రామ శివారులో ఉన్న ఈ ఆలయానికి భక్తులు పోటెత్తారు. జనం తండోపతండాలుగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం ఓంకార్ పెట్టి లైజర్ యాజమాన్యం గద్దె ఏసుబాబు, ఉప్పలపాటి చంద్రశేఖర్ లు దాతృత్వంతో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

## కూటమి ప్రభుత్వం లో పరుగులు పెడుతున్న అభివృద్ధి. ఎమ్మెల్యే మద్దిపాటి.







**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తున్నదని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని భీమోలు గ్రామంలో ఆదివారం ఆయన ఆర్టీసీ బస్సు సర్వీసును పునః ప్రారంభించారు. అలాగే గ్రామంలోని ప్రధాన రహదారి ప్రక్కన నిర్మించిన బస్సు షెల్టర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కనీస అవసరాలు తీర్చవలసిన బాధ్యత ప్రభుత్వం ది అన్నారు. గత 47 సంవత్సరాలుగా గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు గత కొన్ని సంవత్సరాల కిందట సర్వీసు నిలిపివేశారన్నారు. దీంతో గ్రామస్తులు అవసరార్థం వేరే గ్రామానికి వెళ్లడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనేవారున్నారు. ముఖ్యంగా విద్యార్థులు వివిధ విద్యాసంస్థలకు వెళ్లడానికి ఎన్నో సమస్యలకు గురయ్యేవారు అన్నారు. అయితే గ్రామస్తులు బస్సు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించానన్నారు. దీంతో మహాశివరాత్రి పుణ్య దినం రోజు గ్రామానికి మళ్లీ బస్సు సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో గ్రామస్తుల చిరకాల వాంఛ నెరవేరినట్లు అవుతుందన్నారు. రాకపోకలు సుగమం అయ్యిందని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామస్తులకు ఇచ్చిన మాట నెరవేర్చినందుకు తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటరాజు బస్సును ప్రారంభించడంతోపాటు నేరుగా బస్సును నడిపి చూపరులను ఆశ్చర్యానికిగురి చేశారు. ముందుగా ఎమ్మెల్యే కు గ్రామ సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ గంగ్రోతు శ్రీనివాసరావు లు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యల్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. తమ గ్రామానికి బస్సును ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే వెంకటరాజును గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. గ్రామ టిడిపి నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొర్లపాటి రాము, మాజీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు యంట్ర ప్రగడ మంగారావు, నందమూరి సత్యనారాయణ, మద్దిపాటి రమేష్, దాకారపు అప్పారావు, గంగ్రోతు పెదరాయుడు కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాల విద్యార్థినిలను పరామర్శించిన బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ. స్వప్న కుమారి..





**అడ్డతీగల, పెన్ పవర్, ఫిబ్రవరి15:** గత రెండు రోజుల క్రితం అడ్డతీగల బాలికల ఆశ్రమ పాఠశాలలో సీజనల్ వ్యాధులకు గురై ఇబ్బంది పడుతున్న విద్యార్థినులను శనివారం రాత్రి బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈ స్వప్నకుమారి విద్యార్థినులను పరామర్శించారు. ప్రతి ఒక్కరిని ఆరోగ్యము ఎలా ఉన్నది అడిగి వారి బాగోవులను తెలుసుకున్నారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే వ్యాధుల పట్ల పిల్లలు అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యం పట్ల ప్రతి విద్యార్థిని శ్రద్ధ వహించాలని స్వప్న కుమారి అన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థినిలకు బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుడిగి. ఆదిలక్ష్మి, పైడియ్య దొర మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోతునూరు పంచాయితీ పన్నుల వసూళ్లలో నత్తనడక



**ఏలూరు ఫిబ్రవరి 15 పెన్ పవర్ :** పన్నుల వసూళ్లలోగ్రామ పంచాయితీలలో పన్నుల వసూళ్లు లక్ష్యలను సాధించని అధికారులపై చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరిస్తున్నా దెందులూరు మండలంలోని కొన్ని పంచాయితీలు పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నాయి. పోతునూరు పంచాయితీలో పన్నులు వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. గ్రామ పంచాయితీ పరిధిలో 600కు పైగా అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఇంటిపన్నులు రూ.11 లక్షల బకాయిలు ఉండగా 300 అసెస్‌మెంట్ల పన్నులు వసూలు చేశారు. ఇంటి పన్నులు వసూళ్లు 30 శాతం వసూలు చేసినట్లు పంచాయితీ అభివృద్ధి అధికారి తెలిపారు. ఇంటి పసూళ్ల రూ.7లక్షలకు పైగా వసూలు చేపి లక్ష్యానికి చేరవలసి ఉంది.

## పోతునూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఇద్దరు టీచర్లు,ఆయాలు



**ఏలూరు ఫిభ్రవరి 15,పెన్‌పవర్:** పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పోతునూరు సెక్టార్‌లోని పలు చోట్ల అంగన్ వాడీ కేంద్రాలలో టీచర్ల కొరత ఉంది. కొన్ని చోట్ల టీచర్లు వారి వ్యక్తి గత కారణాలతో రాజీనామా చేశారు. ఖాళీలు ఉన్న చోట్ల టీచర్లను సర్దుబాటు చేయకుండా ఆయాలతో నిర్వహిస్తున్నారు. పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని దెందులూరు మండలం పోతునూరు గ్రామంలో 3 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటికి సొంత భవనాలు లేవు. అన్నీ రెంట్ ఫ్రీ నిర్వహిస్తున్నారు. రెండు సెంటర్లు ఎంపిపి స్కూల్‌లోను,మరోకటి గ్రామంలోనే నిర్వహిస్తున్నారు. ఎంపిపి స్కూల్ లో ఒకే కేంద్రంలో రెండు సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఇక్కడ 23 మంది పిల్లలు ఉన్నారు. ఈ కేంద్రంలో ఇద్దరు టీచర్లు ఇద్దరు ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. ఒకే కేంద్రంలో రెండు సెంటర్లను నిర్వహిస్తున్నందున ఒక టీచర్,ఒక ఆయా సరిపోతారు. పెక్టార్‌లో టీచర్ టీచర్ లేని అంగన్ వాడీ కేంద్రంలో ఇక్కడ అదనపు సిబ్బందిని బదిలీ చేస్తే అక్కడ సెంటర్ నిర్వహణ సిబ్బంది కొరత ఉండదు అయితే స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమౌతున్నాయి. అదనపు సిబ్బందిని ఖాళీలు ఉన్న చోటుకి బదిలీ చేస్తే సిబ్బంది కొరత ఉన్న సెంటర్ నిర్వహణ మెరుగుపడుతుందని ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అక్కరకు రాని తొట్టేలు



**ఏలూరు ఫిబ్రవరి 15 పెన్‌పవర్ :** దెందులూరు మండలం పోతునూరు సచివాలయం వద్ద వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు నిర్మించిన నీటి తొట్టేలు నిరుపయోగంగా మారాయి. వీటి నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిరుపయోగంగా మారింది. పంచాయితీ అదికారులు నీరు నింపకపోవడంతో తొట్టేలో చెత్త పడుతొందని స్ధానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల నీటి తొట్టేను ఉపయోగింలోకి తీసుకురావాలని కోరుతున్నారు


## శిరిడి సాయిబాబా వారిని దర్శించుకున్న భక్తులు.





**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** మండలంలోని రాజం పాలెం గ్రామ శివారులో కొలువైయున్న శ్రీ షిరిడి సాయిబాబా వారి ఆలయంలో 21వ వార్షిక మహోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సాయి సేవక్ అడ్డూరి రామారావు దంపతులు ఈ ఆలయాన్ని రెండు దశాబ్దాల కిందట నిర్మించారు. పూజ్య గురువులు అమ్ములు సాంబశివరావు ఆశీస్సులతో ప్రతి ఏటా మూడు రోజులు పాటు ఇక్కడ ఉత్సవాలు జరుగుతూ ఉంటాయి. ఆలయం వద్ద నూరు అడుగుల సాయి స్థూపం ఎంతో ఆకర్షణగా నిలుస్తుంది. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా సాయి బాబా వారికి కాగడ హారతి, హోమము, అభిషేకాలు, పూజలు, పవళింపు సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఏటా శివరాత్రి రోజు జరిగే ఈ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బాబా వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరిస్తారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి రావడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సాయి సేవకులు భక్తులకు చేదోడు వాదోడుగా నిలిచి సేవా కార్యక్రమాలు చేపట్టారు. బాబా వారి దర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో అడ్డూరి రామారావు కుటుంబీకులు, భక్తులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్ళు, త్రాగునీరు, విశ్రాంతి వసతి వంటివి నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

## ఘాట్ ల, శివాలయాల వద్ద డ్రోన్లు, సోలార్ సిసి కెమెరాలతో పోలీసులు పర్యవేక్షణ





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఘాట్ ల వద్ద, శివాలయాల వద్ద తెల్లవారుజాము నుంచి విధులలో తూర్పుగోదావరి జిల్లా పోలీస్ యంత్రాంగం నిమగ్నమైంది. ఆలయ పరిసర ప్రాంతాలలో నిఘా కోసం డ్రోన్లు సోలార్ సిసి కెమెరాలు వినియోగించారు.

ఘాట్ ల వద్ద ఇంటిగ్రేటెడ్ అవుట్ పోస్టులు, కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు.

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లాలోని శివాలయాలలో జరుగుతున్న ఉత్సవాల సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో స్నానపు ఘాట్ల వద్ద, ఆలయాల వద్ద, క్యూ లైన్ల వద్ద, పార్కింగ్ ప్రదేశాల వద్ద ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా తెల్లవారుజాము నుంచే లా అండ్ ఆర్డర్, సిసిఎస్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది విధులలో ఉన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించారని అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

## గంగవరం ఎస్ఐగా వెంకయ్య



**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** గంగవరం ఎస్సైగా ఎస్ వెంకయ్య ఆదివారం బాధ్యతలు చేపట్టారు.


ఇప్పటివరకు గంగవరం ఎస్సైగా పనిచేసిన బి వెంకటేష్ ఇటీవల ఏసీబీకి చిక్కడంతో పాడేరు స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహి నిర్వహిస్తున్న ఎస్ వెంకయ్యను గంగవరం ఎస్సైగా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు నియమించడంతో ఆదివారం విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ లో గంజాయి డ్రగ్స్ నిర్మూలనకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు సమస్యలను బాధితులు స్వయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. విధుల్లో చేరిన ఎస్సై వెంకయ్యను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# బాబా వారి ఆశీస్సులు అందరికీ ఉండాలి.

✹ మాజీ మంత్రి వనిత.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** రాష్ట్ర మాజీ మంత్రి, నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ తానేటి వనిత ఆదివారం రాజంపాలెం లో కొలువై ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా వారిని దర్శించుకున్నారు. ఈ ఆలయాన్ని సాయి సేవక్ అడ్డూరి రామారావు గత రెండు దశాబ్దాల కిందట నిర్మాణం గావించారు. అప్పటినుండి ప్రతి ఏట ఆలయ వార్షిక మహోత్సవాలు నిర్వహిస్తూ ఉంటారు. భారీ స్థాయిలో అంగరంగ వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. కార్యక్రమంలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు వెలగా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో మాజీ మంత్రి వనితతో సహా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఈ ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ శిరిడి సాయిబాబా వారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజానీకం పై ఉండాలన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలు ఆయురారోగ్యాలతో ఆనందంగా గడపాలన్నారు. జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. బాబా వారిని దర్శించుకుని అక్కడ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూసం రామ్మోహన్ రెడ్డి, ఖాదర్ వల్లి, సాలి వేణు, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, బొమ్మ మురళీకృష్ణ, చిలక లక్ష్మణస్వామి, పంది ప్రకాశం, మల్లిపూడి నాగార్జున, అడ్డూరి సోంబాబు, బొమ్మిడి నాగరాజు, టేకు సత్తిబాబు, పోల్నాటి సురేష్, మారాజు రాజేష్ తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## టీకే ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర పంపిణీ



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, ఫిబ్రవరి 15:** మహా శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సీతంపేట వాటర్ ట్యాంకులు వద్ద తేతలి కనికిరెడ్డి బస్టాండ్ వద్ద గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షులు,రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ టి.కే. విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, మంచినీటి ప్యాకెట్లు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గోదావరి రేవుల్లో భక్తులకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు బాగా చేసారని ప్రశంసించారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలకు ట్రయల్ రన్గా ఈ శివరాత్రి వేడుకలను భావించడం మంచి పరిణామమన్నారు. స్నానఘట్టాలకు సమీపంలో భక్తులకు మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేస్తే బాగుండేదన్నారు. తమ వంతుగా పులిహోర, మంచినీరు వితరణ చేసామన్నారు. జిల్లా కలెక్టర్, కమీషనర్, ఎస్పీ, ట్రాఫిక్ డిఎస్పీ, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు ఎస్.వి.వి. రెడ్డి, వింజమూరి భాస్కరరావు, చుక్క ఏసు ప్రసాద్, శ్రీను, సతీష్, వరప్రసాద్, రమణ, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ శివానుగ్రహం ఉండాలి . ఎమ్మెల్యే బొలిశెట్టి.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 15:** ప్రజలందరికీ శివానుగ్రహం ఉండాలని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ ఆకాంక్షించారు. మహా శివరాత్రి సందర్భంగా ఎమ్మెల్యే ఆదివారం వివిధ శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వీరంపాలెంలో గరిమెళ్ల వేంకట రమణ శాస్త్రి శివాలయం నిర్మించి, తాడేపల్లిగూడెం నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో పేరు,ప్రఖ్యాతులు తీసుకు వచ్చారని అన్నారు. కృష్ణాయపాలెంలో శివాలయానికి అన్న సంతర్పణ నిమిత్తం రూ.39,000 విరాళం ఇచ్చారు. 1వార్డులో ఉన్న విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ ఆధ్వర్యంలో స్థానిక 13 వార్డులో కాలువ గట్టున ఉన్న పెద్ద శివాలయం లో ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు.ఈ కార్యక్రమాలలో వర్తనపల్లి కాశి, చాపల రమేష్, కట్టుపోయిన వెంకటలక్ష్మి,పాలూరి వెంకటేశ్వరరావు, అడ్డగర్ల సూరి, కేతిరెడ్డి రాంబాబు, మట్ట రామకృష్ణ,నల్లగంచి రాంబాబు, వాడపల్లి సుబ్బరాజు, రామ లక్ష్మణ్, కాళ్ల గోపికృష్ణ, పసల కొండ, తాగారపు శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన శైవ క్షేత్రాలు



**పెన్ పవర్ । ఉంగుటూరు । ఫిబ్రవరి 15**

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఉంగుటూరు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి.

తెల్లవారుజాము నుంచే భక్తులు శివాలయాలకు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నారాయణపురం ఏలూరు కాలువ గట్టు వద్ద వేంచేసి ఉన్న శివాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. “ఓం నమఃశివాయ” నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

ఉంగుటూరు, నారాయణపురం, కంసాలీగుంట శివాలయాల్లో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులతో కలిసి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.

నారాయణపురం శివాలయంలో నిడమర్రు తహసీల్దార్ బొడ్డేపల్లి దుర్గాప్రసాద్ సారథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, క్యూలైన్లు, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించారు.

మహాశివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా కొనసాగాయి.

## హిందూ సనాతన ధర్మాన్ని కూటమి ప్రభుత్వం కాపాడుతుంది

- ఎండోమెంట్ కమిటీల సేవలకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అభినందన



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**

మహా శివరాత్రిని పురస్కరించుకుని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గోదావరి గట్టున ఉన్న శ్రీ మార్కండేయేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతి లను దర్శించుకుని పూజలు చేశారు. ప్రజలంతా సుఖసంతోషాలు... ఆయురారోగ్యాలతో ఉండేలా దీవించాలని స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం భక్తులకు స్వామి వారి ప్రసాదాలను వితరణ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాసు మాట్లాడుతూ, మహాశివరాత్రి మహోత్సవాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారని అన్నారు. దేవస్థాన కమిటీలు, స్థానిక నాయకత్వం భక్తులకు ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా సేవలు అందిస్తున్నారని అభినందించారు. పుష్కరాలను దృష్టిలో ఉంచు కుని ట్రయల్ రన్ కింద ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ తో సీసీకెమెరాలతో ఘాట్ లో స్నానాలు, తెలుసుకోవడం చేసామని, పిల్లలు మిస్ అయితే స్కాన్ ద్వారా గుర్తించే టాగ్స్ వేయించామని, కమాండ్ కంట్రోలు రూమ్ లో ఏర్పాట్ల ను పరిశీలించామనిఎమ్మెల్యే వాసు పేర్కొన్నారు. శ్రీ ఉమా కోటిలింగే శ్వర స్వామి, జాంపేట శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి, సారంగాధరేశ్వర స్వామి ఆలయల ఉత్సవాల్లో పాల్గొన్నారు. టినగర్ లో, కాస్మోపాలిటన్ క్లబ్ , లింగంపేట , మూలగొయ్యి సెంటర్, చింతాలమ్మ ఘాట్ , కృష్ణానగర్ , ఆంజనేయ స్వామి గుడి, దేవీచౌక్ పశువుల ఆసుపత్రి, అశోక థియేటర్ అన్నదాన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వాసు పాల్గొని ప్రసాద వితరణ చేసారు. దేవిచౌక ఆదిమూలం వారి పసుపు కుంకుమ వేడుకలో పాల్గొన్నారు. ఆలయ కమిటీల సభ్యులు, టీడీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు

# శివనామ స్మరణతో మారు మ్రోగిన శివాలయాలు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న శివాలయాలు శివనామ స్మరణతో మారు మ్రోగాయి. శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఆయా గ్రామాలలో ఉన్న ఆలయాల్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గోపాలపురంలో ఉన్న శివాలయాన్ని స్థానిక శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు టిడిపి నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే చెరుకుమిల్లి గ్రామంలో ఉన్న పురాతన శివాలయం, చిట్యాల, హుకుంపేట, దొండపూడి తదితర గ్రామాలలో ఉన్న శివాలయాలతో పాటు సాగిపాడు గ్రామ శివారులో కొవ్వాడ కాలువ గట్టు పై ఉన్న స్వయంభు శ్రీ భీమ లింగేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ భీమలింగేశ్వర స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ ఆలయంలో ఉన్న శివలింగం 2005 సంవత్సరంలో మట్టిలో దొరికిందన్నారు. కొవ్వాడ కాలువ గట్టు సమీపాన పొలం పనులకు సంబంధించిన తవ్వకాలు జరుగుతున్న సమయంలో మట్టిలో నుండి అత్యంత పురాతనమైన శివలింగం దొరికిందన్నారు. ఆ శివలింగాన్ని బయటకు తీసి పవిత్ర జలాలతో శుభ్రం చేసి ఆలయంలో ప్రతిష్టించామన్నారు. అప్పటినుండి ప్రతి ఏటా మహాశివరాత్రి రోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మచ్చ రాంబాబు, ప్రగడ చింతారావు, చల్లా శ్రీను, అనిశెట్టి వీరభద్ర రావు, సాదు బోయిన శ్రీను, ఆకుల పెద్దకాపు, ఆసుపోయిన బాబురావు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### దక్షిణ కాశీ వీరంపాలెం
### స్పటిక లింగ దర్శనంతో మారుమొగింంన శివనామస్మరణతో శివాలయులు







**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 15.** తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం లో మహాశివరాత్రి ఉత్సవాల ఘనంగా జరిగాయి స్పటిక లింగ దర్శనంతో భక్తుల శివనామస్మరణతో ఆలయం మారుమొగింది.
బాల త్రిపుర సుందరి పీఠాధిపతి గరిమెళ్ళ వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో దాదాపు 70 వేల మంది భక్తులు శివరాత్రి సందర్భంగా విశ్వేశ్వరుని దర్శించుకున్నారు. కాశీ నమూనాలో వారణాసిలో విశ్వేశ్వరుని ఆలయం మాదిరిగా నిర్మించిన ఈ వీరంపాలెం ఆలయం రెండు దశాబ్దాలుగా జాతీయస్థాయి ప్రాధాన్యతను సంతరించుకుంది సామాన్య భక్తుల నుంచి వీఐపీలతో పాటు రాజకీయ నాయకులు అధికారులతో శివరాత్రి పర్వదినాన వేలాది భక్తులతో ఆలయం కలకల్లాడింది.
గరిమెళ్ళ సందీప్ ఏమని శశి కుమార్ లలిత తదితరుల బ్రహ్మోత్వంలో వీరంపాలెంలో శివరాత్రి ఉత్సవాలు హోరెత్తయి.
భక్తుల తాకిడికి తగ్గట్టుగా ఆర్టీసీ బస్సులు ఉచిత బస్సులు కూడా ఏర్పాటు చేశారు బార్కెట్లు నిర్మించారు.
ఉచిత ప్రసాద వితరణ చేపట్టారు.
స్పటిక లింగ దర్శనానికి ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు.
పోలీసు బందోబస్తు తో పాటు మెడికల్ క్యాంపు కూడా నిర్వహించారు.
ఎమ్మెల్యేల సందడి
పలువురు ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు వీరంపాలెం విశ్వేశ్వరుని దర్శించుకున్నారు తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ఇంకా పలువురు వీఐపీలు స్వామివారిని దర్శించుకున్నారు వీరంపాలెం శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు హోమాలు నిర్వహించారు

## సోషల్ మీడియా కార్యకర్తలకు స్థానికంగా పార్టీ భలోపేతం చెయ్యాలి.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 15.** తాడేపల్లిగూడెం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా సమావేశం నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డి రఘురామ్ గారి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రఘురామ్ గారు సోషల్ మీడియా కార్యకర్తలకు స్థానికంగా పార్టీ భలోపేతం చెయ్యుటకు తీసుకొనవలసిన చర్యలపై, చేయవలసిన కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. క్షేత్ర స్థాయిలో సోషల్ మీడియా కార్యకర్తలకు ఉన్న సమస్యలు గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు మండల అధ్యక్షులు కైకాల శ్రీనివాస్, వైసీపీ నాయకులు నల్లిమిల్లి అంజిరెడ్డి, కలిశెట్టి తాతారావు, జయరామ్, తానేటి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కనుపూరు మహా శివరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న కంబాల



**వేల మంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం**

**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** కోరుకొండ మండలం కనుపూరు గ్రామంలో ఆదివారం ప్రారంభమైన స్వయంభు శ్రీ భ్రమరాంబిక సంహిత మల్లికార్జున స్వామి 64వ మహాశివరాత్రి మహోత్సవాల్లో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు,బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.అయనకు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు, మహిళలు, హరతులు పట్టి, ఘన స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. అనంతరం శ్రీ భ్రమరాంబిక సంహిత మల్లికార్జున స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయం వద్ద 15 వేల మంది భక్తులకు కంబాల శ్రీనివాసరావు సొంత విరాళంతో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి హిందూ ధర్మ పరిరక్షణ కోసం నిరంతర కృషి చేస్తూ,కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరుగుతుందని అన్నారు. మన ధర్మాన్ని రక్షించుకోవడం కోసం అందరూ కలిసికట్టుగా నిలబడాలని పిలుపునిచ్చారు.విద్య, వైద్య,ఆర్థిక పరంగా ఎంతో మంది పేదలకు సహాయం అందజేశానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు బీజేపీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు,గ్రామస్తులు, మహిళలు యువత యువత పాల్గొన్నారు.



## వీరంపాలెం శ్రీ బాల త్రిపుర సుందరి పీఠం సందర్శించిన వడ్డి రఘురామ్.





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 15.** మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం గ్రామంలోని శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠాన్ని తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఎంతో విశిష్టత కలిగి, సంవత్సరంలో రెండు సార్లు మాత్రమే చూడగలిగే స్పటిక లింగానికి శ్రీ బాలా త్రిపుర సుందరి పీఠం నిర్వాహకులు బ్రహ్మశ్రీ గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి గారి సమక్షంలో 12 నదీజలాలతో అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ఆ పరమశివుని కృపతో తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాకిరెడ్డి అఖిల్ రెడ్డి, రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శాటిలైట్ సిటీ గ్రామంలో ముస్లిం మహిళలకు రంజాన్ తోఫా పంపిణీ



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:**రూరల్ మండలం శాటిలైట్ సిటీ గ్రామం లో పవిత్ర రంజాన్ మాసంను పురస్కరించుకొని జనాబ్ మీర్జా అన్వర్ బేగ్ సౌజన్యంతో తుమ్వా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మహిళల 100 కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేసారు. టిడిపి నాయకులు షేక్ సుభాన్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వైద్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవి రామ్ కిరణ్ ముఖ్యఅతిథిగా పాల్గొనడం జరిగింది. . ఈ కార్యక్రమం చారిటీ కోఆర్డినేటర్ ముజ్జిబుర్ రెహమాన్ సహకారంతో నిర్వహించడం జరిగింది.
ఈ సందర్బంగా రవిరామ్ కిరణ్ మాట్లాడుతూ, పవిత్రమైన రంజాన్ నెల ప్రారంభం శుభ సందర్బంగా రంజాన్ తోఫా ఏర్పాటు చేసిన పెద్దలకు అభినందనలు తెలిపారు. ప్రతీ ఒక్కరూ రంజాన్ నెలలో వారి శక్తీ కొలది పేదవారికి సహాయం అందంచాలని అల్లా కృప ప్రతీ ఒక్కరికి లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రూరల్ మండల అధ్యక్షులు మత్సెటి శివ ప్రసాద్, సాటిలైట్ సిటీ గ్రామ కమిటీ అధ్యక్షులు నిచ్చెన కోళ్ల సత్తిబాబు, ఎం ఎస్ ఆర్.శ్రీను, బైరెత్తి.సరోజినీదేవి,పెంకే కోటేశ్వరరావు, యర్ర రాంబాబు, బుడంపర్తి నాగేశ్వరరావు, ఎస్ కే బాషా, కొమ్మజు పెద్ది రాజు,మసీదు కమిటీ అధ్యక్షులు షేక్ మదీనా , కమిటీ సభ్యులు నయీమ్, భాష, రాజమండ్రి జనసేన నాయకులు షేక్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు

### వీరంపాలెంలో శివలింగానికి అభిషేకం చేసిన ఎమ్మెల్యే మద్దిపాటి.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.** వీరంపాలెంలో కొలువైయున్న శ్రీ బాల త్రిపుర సుందరి శైవ పుణ్యక్షేత్రాన్ని గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు, పెన్వీర్ సంస్థ వ్యవస్థాపకులు ఘంటా మధు కృష్ణ లు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జరిగినప్రత్యేక పూజా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా పుణ్యక్షేత్రం వ్యవస్థాపకులు వెంకటరమణ సిద్ధాంతి వెంకటరాజు,మధు కృష్ణ లకు సాదర స్వాగతం పలికారు. అనంతరం పుణ్యక్షేత్ర ఆవరణలో ఉన్న భారీ శివలింగానికి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వారు ఇరువురు అభిషేకం చేశారు. అనంతరం మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే ఉండే స్పటిక లింగ దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమాలు అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీ బాల త్రిపుర సుందరి అమ్మవారి సర్వ క్షేత్రంలో ప్రతి ఏటా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తూ ఉంటారు. మహాశివరాత్రి రోజు స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు, లక్ష దీపార్చన తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## జంబుపట్నం శివాలయంలో భారీ అన్నదానం..



కోరుకొండ మండలం జంబుపట్నం గ్రామ శివాలయంలో మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం శివాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు హోమాలు, యజ్ఞాలు, భజన కార్యక్రమాలు నిర్వహించి భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భారీగా తరలివచ్చారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

## స్వయంభు మల్లికార్జున స్వామిని దర్శించుకున్న తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరి..



**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** కనుపూరు స్వయంభు పంచముఖ మల్లికార్జున స్వామి వారిని 64వ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు వెంకటరమణ చౌదరికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## శివనామ స్మరణతో మారు మ్రోగిన శివాలయం





**వి.ఆర్.పురం పెన్.పవర్.ఫిబ్రవరి.15.** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో రుద్ర కోటేశ్వర స్వామి,వెలసియున్న శివాలయంలోఆదివారం శివనామ స్మరణతో మారు మ్రోగాయి.శివాలయం ప్రాంగణంలో విద్యుత్ దీపాలతో వైభవంగా అలంకరించారు.మహాశివ రాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.తెల్లవారుజాము నుండి భక్తులు వంద లాదిగా తరలివచ్చిఆ ముక్కంటి కరుణాకటాక్షాలను పొందేందుకు దీక్షాభక్తులతో స్వామివారిని దర్శించు కున్నారు.వడ్డిగూడెం దేవస్థానం చైర్మన్,ఆదినారాయణ ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల కళ్యాణ మహోత్స వాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు.పార్వతీ పర మేశ్వరుల కళ్యాణ వేడుకకు దూరప్రాంతాల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దైవదంపతులకు మంగళహారతులు సమర్పించారు.భక్తులకు ఆలయ కమి టీవారు ద్వారా ప్రసాదాలు పంపిణీ చేశారు.వివిధ గ్రామా ల దేవాలయాల్లో కూడా శివరాత్రి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పోలీసులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.ద

## ప్రభుత్వేతర విద్యాసంస్థల్లో బలహీన వర్గాల పిల్లలకు సీట్లు

విద్యాశాఖ అధికారులు.

**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15.**
ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని ప్రభుత్వేతర పాఠశాలల్లో బలహీన వర్గాల పిల్లలకు సీట్లు ఇవ్వడం జరుగుతుందని మండల విద్యాశాఖ అధికారులు జి శ్రీనివాసరావు, ఏ ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా చట్టాన్ని అనుసరించి రాబోయే సంవత్సరానికి ప్రైవేట్ పాఠశాలలలో చదువుకోడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. సమీపంలో ఉన్న పాఠశాలలలో విద్యనభ్యసించడానికి 25 శాతం సీట్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 20 నుండి మార్చి 15 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపికైన వారి జాబితాను గ్రామ సచివాలయం, మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం లో తెలుసుకోవచ్చు అన్నారు. దరఖాస్తుదారునీ, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, జనన ధ్రువపత్రాలను దరఖాస్తులు పొందపరచవలసి ఉందన్నారు. వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

# 30 వ కళ్యాణ మహోత్సవం




కాశి విశ్వేశ్వర స్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో

**టీ నర్సాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి15:** శ్రీ అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశి విశ్వేశ్వర స్వామి వారి దివ్య క్షేత్ర ప్రాంగణంలో 30 వ కళ్యాణ మహోత్సవ భాగంగా మూడో రోజు శివరాత్రి కలిసి రావడంతో భక్తులు విశిష్ట స్థాయిలో స్వామివారిని దర్శించుకున్నారు. కమిటీ వారు వచ్చిన భక్తులకు సామూహిక అభిషేకలకు ఏర్పాటు చేయడంతో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.సుమారు 3 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు వచ్చిన భక్తులందరికీ ఆలయ అర్చకులు సాయి రవీంద్ర శర్మ తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ వెంకట శ్రీనివాస్ మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా దాతలు సహకారంతో 30 వ కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని ఈ శివరాత్రి కళ్యాణ మహోత్సవాలు ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పర్వత నేనిమురళి, పసుమర్తి రాము,లింగారెడ్డి శ్రీనివాస్, రమేష్ రాజు, మరీదు వెంకట నాగేశ్వరరావు, చిలుకూరి కృష్ణ ప్రసాద్,



నూతి నాగరాజు,మణికంఠ వేజ్జురాజు,రాటాలు, వాటర్ ప్లాంట్ మురళి,తో పాటు ఆలయ కమిటీ డైరెక్టర్లు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.




## యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17న చలో విజయవాడ రణభేరి 2.0 ని జయప్రదం చేయండి

UTF పోలవరం జిల్లా కమిటీ పిలుపు

**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి15:** రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన పి ఆర్ సి ఐ ఆర్ మరియు ఇతర ఆర్థిక డిమాండ్లపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 17వ తారీఖున చలో విజయవాడ రణభేరి 2.0 జయప్రదం చేయాలని,పోలవరం జిల్లా శాఖ పరిధిలోని యూటిఎఫ్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ పోలవరం జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి. విశ్వరాజ్, కె. కృష్ణ ఒక ప్రకటన లో తెలిపారు.ఉద్యోగ ఉపాధ్యాయ వర్గానికి 2023 జూలై నుండి 12వ పిఆర్సి అమలు చేయాల్సి ఉండగా మూడేళ్లు కావస్తున్న నేటికీ పిఆర్సి కమిషన్ గాని, ఐ ఆర్ గాని ప్రకటించకపోవడం ఉద్యోగ వర్గాలలో తీవ్ర అసంతృప్తి నెలకొందని అలాగే ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాలుగు డీఏలు పెండింగ్ లో ఉన్నాయని వీటికి కూడా బడ్జెట్లో కేటాయింపు లేకపోవడం వలన ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా పి ఆర్ సి, ఐఆర్ అమలు జరగదని తీవ్ర ఆవేదన, అసంతృప్తి తో ఉద్యోగులు ఉన్నారన్నారు. జిల్లాలోని ఉద్యోగులందరూ చలో విజయవాడ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## మా తండాల్లో మా రాజ్యం కోసం తండాల్లో నాయక్ వ్యవస్థ

బంజారా భజరంగీ భేరి నాయకులు నాగరాజు నాయక్





**టీ నర్సాపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 15:** కృష్ణాపురం సంత్ సేవాలాల్ మహారాజ్ గుడి వద్ద సేవాలాల్ 287వ జయంతి వేడుకలు బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భూక్యా భిగనాధం మహా భోగ్ ను వెలిగించారు. మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య, భూక్యా వాలీ, జరభల చందోలా బంజారా ధర్మ త్రిమూర్తులైన హనుమాన్, హాథిరామ్, సేవాలాల్ జెండాలను ఎగురవేశారు. సేవాలాల్ జ్యోతిని తీన్మార్ డప్పులతో ఊరంతా ఊరేగించారు. సేవాలాల్ నాయక్ అవార్డుల సదస్సుకు జరభల చందా నాయక్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ మా తండాల్లో మారాజ్యం సాధించేందుకు నాయక్,కార్భరీ, డావో,హసాబీ,నసాబీ ఐదుగురితో కూడిన పంచాయితీ వ్యవస్థను తండాల్లో ఏర్పాటుచేయాలని అన్నారు.
సంఘ అధ్యక్షులు భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, ప్రతి తండాల్లో సేవాలాల్ మందిరాల నిర్మాణానికి ప్రభుత్వం సహకారం అందించాలని, తండాలను ప్రత్యేక గ్రామ పంచాయితీలుగా ఏర్పాటుచేయాలని అన్నారు.
తెలంగాణా బంజారా నాయకులు నుణావత్ సోమ్లా నాయక్ మాట్లాడుతూ తండా రాజ్యంను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఏకం చేసి, మద్యపానం, జీవహింసలకు బంజారాలు దూరంగా ఉండాలని హితబోధనలను సేవాలాల్ మహారాజ్ చేశారని అన్నారు.
తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ నుండి 25మంది బంజారా నాయక్, కార్భరీలకు సేవాలాల్ మహారాజ్ అవార్డులు ఇచ్చి ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం జరిగిన మహా అన్న దానం కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది భక్తులు పాలుగొన్నారు. ఈ కార్యక్రమంలో జరభల కృష్ణ ప్రసాద్, భూక్యా పోతురాజు, ధరావతు జ్యోతి కిషోర్, భూక్యా బాబురావు, భూక్యా వెంక్టీ, మూడు శ్రీనివాసరావు, భూక్యా భద్రమ్మ, జరభల చింతామణి, జరభల అరుణ, మూడు సోని, ధరావతు రమేష్, సవరం రామదాసు, ఒంటిపల్లి సోమేశ్వరావు తదితరులుపాల్గొన్నారు.

## పలివెల ఉమాకొప్పులింగేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

భక్తిశ్రద్ధల మధ్య రథోత్సవాన్ని ప్రారంభించినారు





**కొత్తపేట,పెన్ పవర్, పిబ్రవరి15;** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రముఖ శైవక్షేత్రం పలివెల శ్రీ ఉమాకొప్పులింగేశ్వర స్వామివారి ఆలయాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు వేదమంత్రాల నాదం మధ్య అర్చకులు, ఆలయ అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జగత్తుకే ఆదిదంపతులైన పార్వతీ పరమేశ్వరుల కృపా కటాక్షాలు రాష్ట్ర ప్రజలపై, నియోజకవర్గ ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.అనంతరం మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించిన వైభవమైన రథోత్సవాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ తన భక్తి భావాన్ని చాటుకున్నారు. శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ఆత్రేయపురంలో కోడిపందాలపై పోలీసుల దాడి



ఏడుగురు అరెస్ట్ నగదు, కోడిపుంజులు స్వాధీనం

**ఆత్రేయపురం పెన్ పవర్ ఫిబ్రవరి 16:** ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆత్రేయపురం గ్రామ శివారులో కోడిపందాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో పోలీసులు ఆకస్మికంగా దాడి నిర్వహించారు. ఎస్సై ఎస్ రాము నేతృత్వంలో పోలీసు బృందం కోడిపందాలు ఆడుతున్న ఏడుగురిని పట్టుకుంది.
వారి వద్ద నుంచి రూ.3,250 నగదు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల నిర్వహణ అక్రమమని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టుబడిన వారిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.
ప్రజలు అక్రమ జూద కార్యకలాపాలపై సమాచారం అందించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడంలో సహకరించాలని పోలీసులు కోరారు.

# పాకిస్థాన్‌ను మట్టికరిపించిన భారత్... వరల్డ్ కప్ సూపర్-8లోకి గ్రాండ్ ఎంట్రీ

**టీ20 ప్రపంచకప్‌లో పాక్‌పై భారత్ ఘన విజయం**

**61 పరుగుల భారీ తేడాతో చిత్తుగా ఓడించిన టీమిండియా**

**భారత్ విజయంలో కీలకపాత్ర పోషించిన ఇషాన్ కిషన్ (77)**

**వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్.. సూపర్-8లోకి ప్రవేశం**

**భారత బౌలర్ల ధాటికి 114 పరుగులకే కుప్పకూలిన పాకిస్థాన్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో భాగంగా జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత విజయాన్ని అందుకుంది. తన చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 61 పరుగుల భారీ తేడాతో మట్టికరిపించింది. కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో ఈరోజు జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. ఈ విజయంతో గ్రూప్-ఏలో వరుసగా మూడో విజయంతో హ్యాట్రిక్ కొట్టింది. తద్వారా టోర్నమెంట్‌లో సూపర్-8 దశకు అధికారికంగా అర్హత సాధించింది. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ ఆది నుంచే తడబడింది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు పాక్ బ్యాటర్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. హార్దిక్ పాండ్య, జస్‌ప్రీత్ బుమ్రా ఆరంభంలోనే వికెట్లు తీసి పాక్‌ను కోలుకోలేని దెబ్బతీశారు. ఒక దశలో 13 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఉస్మాన్ ఖాన్ (44) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. అయితే, అతడు ఔటైన తర్వాత పాక్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. భారత బౌలర్లు మూకుమ్మడిగా రాణించడంతో పాకిస్థాన్ 18 ఓవర్లలో 114 పరుగులకే ఆలౌట్ అయింది. హార్దిక్, బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా రెండు వికెట్లు తీయగా, కుల్దీప్ యాదవ్, తిలక్ వర్మ చెరో వికెట్ పడగొట్టారు. ఈ విజయంతో భారత్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. అభిషేక్ శర్మ డకౌట్‌గా వెనుదిరిగాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఇషాన్ కిషన్ పాక్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. కేవలం 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. అతనికి తిలక్ వర్మ (25), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (32) నుంచి మంచి సహకారం లభించింది. అయితే, మిడిల్ ఓవర్లలో హార్దిక్ పాండ్య (0) విఫలమవడంతో స్కోరు వేగం తగ్గింది. చివర్లో శివమ్ దూబే (17 బంతుల్లో 27), రింకు సింగ్ (4 బంతుల్లో 11) వేగంగా ఆడటంతో భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగుల గౌరవప్రదమైన స్కోరు సాధించింది. పాక్ బౌలర్లలో సైమ్ అయూబ్ 3 వికెట్లు పడగొట్టాడు.

ఇక, భారత్ గ్రూప్-ఏలో తన చివరి లీగ్ మ్యాచ్‌ను నెదర్లాండ్స్ తో ఈ నెల 18న అహ్మదాబాద్‌లో ఆడనుంది.

# నేపాల్‌పై గెలిచి... దర్జాగా సూపర్-8 లోకి ప్రవేశించిన వెస్టిండీస్

- టీ20 ప్రపంచకప్‌లో నేపాల్‌పై వెస్టిండీస్ 9 వికెట్ల తేడాతో భారీ విజయం
- ఈ విజయంతో గ్రూప్-సి నుంచి సూపర్ 8 దశకు అర్హత సాధించిన విండీస్
- అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన షాయ్ హోప్, హెట్‌మెయర్ మెరుపు ఇన్నింగ్స్
- బౌలింగ్‌లో 4 వికెట్లతో నేపాల్‌ను దెబ్బతీసిన జాసన్ హోల్డర్
- ఈ ఓటమితో టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించిన నేపాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ జట్టు అద్భుత ప్రదర్శనతో సూపర్ 8 దశకు అర్హత సాధించింది. ఆదివారం ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరిగిన గ్రూప్-సి మ్యాచ్‌లో నేపాల్‌పై 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బౌలింగ్‌లో, ఆ తర్వాత బ్యాటింగ్‌లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన కరీబియన్ జట్టు, ఈ టోర్నీలో నేపాల్ ప్రస్థానానికి ముగింపు పలికింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న వెస్టిండీస్‌కు కెప్టెన్ నిర్ణయం సరైనదని బౌలర్లు నిరూపించారు. జాసన్ హోల్డర్ (4/27) అద్భుత బౌలింగ్‌తో నేపాల్ బ్యాటింగ్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా, దీపేంద్ర సింగ్ ఐరీ (47 బంతుల్లో 58) ఒంటరి పోరాటం చేసి హాఫ్ సెంచరీ సాధించాడు. చివర్లో సోంపాల్ కమీ (15 బంతుల్లో 26) వేగంగా ఆడటంతో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 133 పరుగులు చేయగలిగింది. అనంతరం 134 పరుగుల సులభ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్ బ్రాండన్ కింగ్ (22) మంచి ఆరంభాన్ని ఇచ్చాడు. అతను ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన షిమ్రాన్ హెట్‌మెయర్ (32 బంతుల్లో 46 నాటౌట్), మరో ఓపెనర్, కెప్టెన్ షాయ్ హోప్ (44 బంతుల్లో 61 నాటౌట్)తో కలిసి విధ్వంసం సృష్టించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు అజేయంగా 91 పరుగులు జోడించడంతో విండీస్ కేవలం 15.2 ఓవర్లలోనే ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. విండీస్ కు ఇది వరుసగా మూడో విజయం కాగా, ఈ గెలుపుతో సూపర్ 8లో అడుగుపెట్టింది. మరోవైపు, ఆడిన మూడు మ్యాచ్ ల్లో ఓటములతో నేపాల్ టోర్నీ నుంచి అధికారికంగా నిష్క్రమించింది.

# టీ20 వరల్డ్ కప్: నమీబియాపై విజయంతో లీగ్ దశ ముగించిన అమెరికా



- టీ20 ప్రపంచకప్‌లో నమీబియాపై 31 పరుగులతో అమెరికా విజయం
- తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా 20 ఓవర్లలో 199 పరుగులు
- అర్ధ శతకాలతో రాణించిన సంజయ్ కృష్ణమూర్తి (68లి), మోనాంక్ పటేల్ (52)
- ఛేదనలో 168 పరుగులకే పరిమితమైన నమీబియా
- నమీబియా తరపున లౌరెన్ స్టీన్‌క్యాంప్ (58) పోరాటం విఫలం

**హైదరాబాద్ పెన్ పవర్:** ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భాగంగా నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో అమెరికా 31 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో అమెరికా బ్యాటర్లు సంజయ్ కృష్ణమూర్తి, కెప్టెన్ మోనాంక్ పటేల్ అర్ధ శతకాలతో చెలరేగడంతో తొలుత భారీ స్కోరు నమోదైంది. అనంతరం లక్ష్య ఛేదనలో నమీబియా తడబడింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అమెరికా, నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 199 పరుగుల భారీ స్కోరు చేసింది. కెప్టెన్ మోనాంక్ పటేల్ (30 బంతుల్లో 52) మెరుపు ఆరంభాన్ని అందించగా, చివర్లో సంజయ్ కృష్ణమూర్తి (33 బంతుల్లో 68 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. అతని ఇన్నింగ్స్‌లో 6 సిక్సర్లు, 4 ఫోర్లు ఉన్నాయి. వీరిద్దరి ధాటికి అమెరికా సునాయాసంగా భారీ స్కోరు చేయగలిగింది. నమీబియా బౌలర్లలో విల్లెమ్ మైబర్గ్, గెరార్డ్ ఎరాస్మస్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన నమీబియా, 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 168 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ లౌరెన్ స్టీన్‌క్యాంప్ (39 బంతుల్లో 58) ఒక్కడే అర్ధ శతకంతో పోరాడాడు. మిగతా బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం లభించలేదు. అమెరికా బౌలర్లలో షాడ్లీ వాన్ షాల్క్‌విక్ రెండు వికెట్లతో రాణించగా, సౌరభ్ నేత్రావల్కర్, అలీ ఖాన్, శుభమ్ రంజానె తలో వికెట్ తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కాగా, లీగ్ దశను అమెరికా విజయంతో ముగించింది. గ్రూప్-ఏలో ఉన్న అమెరికా మొత్తం 4 మ్యాచ్ లు ఆడి 2 విజయాలతో భారత్, పాక్ తర్వాత మూడో స్థానంలో ఉంది.

# సూపర్ స్టార్‌ని వెనక్కి నెట్టిన ఐకాన్ స్టార్!







జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించిన -బాహుబలి- సిరీస్ తరువాత స్టార్స్ చేసే ప్రతి సినిమా లార్జెన్ దెన్ లైఫ్ మూవీగానే చేయాలని చూస్తున్నారు. అలాంటి కథలనే ఎంచుకుంటున్నారు. బడ్జెట్ విషయంలోనూ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. ప్రతీదీ భారీ స్థాయిలోనే ఉండేలా ప్లాన్ చేసుకుంటున్నారు. దీంతో సినిమా బడ్జెట్‌లు పతాక స్థాయికి చేరుకుంటు న్నాయి. బడ్జెట్‌ని బట్టి స్టార్ల పారితోషికాలు కూడా చుక్కలని తాకుతుండటం తెలిసిందే. ఒకప్పుడు భారీ స్థాయిలో రికార్డు స్థాయి పారితోషికాలు అనేవి బాలీవుడ్ వరకే పరిమితంగా ఉండేవి. కానీ దక్షిణాదిలో పాన్ ఇండియా సినిమాల ట్రెండ్ మొదలయ్యాక అది దక్షిణాదికి కూడా పాకింది. ప్రపంచ సినిమాతో పోలిస్తే ఇండియాలోనే సినిమాల నిర్మాణం ఎక్కువ. సినిమాల హడావిడీ కూడా ఎక్కువే. బాలీవుడ్ టు టాలీవుడ్ వరకు స్టార్స్ కూడా ఎక్కువే. అయితే పాన్ ఇండియా సినిమాల ప్రవాహం పెరిగిన స్టార్స్ భారీ బ్లాక్ బస్టర్లని సొంతం చేసుకుంటున్న నేపథ్యంలో ఇండియాలో అత్యధికపారితోషికాన్ని అందుకుంటున్న టాప్ 3 స్టార్స్ ఎవరన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ జాబితాలో ఇండియా వైడ్‌గా నిలిచింది ముగ్గురు స్టార్స్. బాలీవుడ్ హీరో షారుక్ ఖాన్. టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ సూపర్‌స్టార్ రజనీకాంత్. అత్యధిక పారితోషికాన్ని తీసుకుంటూ షారుక్ ఖాన్ మొదటి స్థానంలో నిలిచాడు. రెండవ స్థానంలో రజనీకాంత్‌ని వెనక్కి నెట్టి ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నిలవడం గమనార్హం. మూడవ స్థానంలో సూపర్ స్టార్ రజనీకాంత్ నిలిచారు. పారితోషికం విషయంలో ఫార్మాట్‌ని మార్చిన ఈ స్టార్స్ ఇప్పుడు సినిమా లాభాల్లో వాటాలని పారితోషికాలుగా డిమాండ్ చేస్తుండటం తెలిసిందే. బాలీవుడ్ బాక్సాఫీస్ బాద్‌షాగా పేరు తెచ్చుకున్న షారుక్ ఖాన్ వరుస ఫ్లాపుల తరువాత -పఠాన్-తో మళ్లీ ట్రాక్‌లోకి రావడం తెలిసిందే. ఈ సినిమా లాభాల్లో తన వాటా కింద షారుక్ రూ. 350 కోట్లు తీసుకున్నాడు. ఇండియన్ సినిమాల్లో ఓ హీరో ఇంత పెద్ద మొత్తంలో పారితోషికంగా తీసుకోవడం ఇదే ఫస్ట్ టైమ్. ఇంత మొత్తం దక్కించుకోవడంతో షారుక్ ఇండియన్ హీరోల్లో అత్యధిక మొత్తం అందుకుంటున్న హీరోగా మొదటి స్థానంలో నిలిచాడు. ఆ తరువాత స్థానంలో బన్నీ వచ్చి చేరాడు. పుష్ప, పుష్ప 2 సినిమాలతో బ్లాక్‌బస్టర్ హిట్‌లని సొంతం చేసుకున్న బన్నీ రూ. 300 కోట్లు డిమాండ్ చేస్తున్నాడు. ఈ జాబితాలో సూపర్‌స్టార్ రజనీకాంత్ మూడవ స్థానంలో నిలుస్తున్నారు. నెల్సన్ దిలీప్ కుమార్ డైరెక్షన్‌లో రజనీ నటించిన మూవీ -జైలర్-. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సొంతం చేసుకుని రజనీ కెరీర్‌లోనే రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టింది. ఈ సినిమా నుంచే రజనీ రూ. 200 కోట్లకు మించి ఒక్కో సినిమాకు డిమాండ్‌చేస్తున్నారట. అయితే ప్రస్తుతం చేస్తున్న 174వ ప్రాజెక్ట్‌కు మాత్రం ఆ మొత్తాన్ని పెంచేశారని, రూ. 225 కోట్లు ఈ ప్రాజెక్ట్‌కు తీసుకుంటున్నారని తెలిసింది. రానున్న రోజుల్లో ఈ జాబితాలోకి మహేష్ వచ్చి చేరతాడా?.. లేక ఎన్టీఆర్, రామ్ చరణ్‌లు చేరతారా అన్నది వేచి చూడాల్సిందే.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965